



ధర్పల్లి పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

భోజనం కలుషితం కాకుండా చూడాలి

- గురుకులాలు, వసతి గృహాల్లో ఆహారం వండడానికి ముందే పదార్థాలను పరిశీలించాలి
- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

ధర్పల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో విద్యార్థులకు అందించే భోజనం, అల్పాహారం కలుషితం కాకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అన్నారు. ధర్పల్లిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఆయన మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. స్టోర్ రూమ్‌ను తనిఖీ చేశారు. ప్రతిరోజూ వండే ముందు ఆహార పదార్థాలన్నింటినీ పరిశీలించాలని సూచించారు. కాలపరిమితి లేని వస్తువులను వాడవద్దని, మెనూ ప్రకారమే విద్యార్థులకు భోజనాన్ని అందించాలని తెలిపారు. ఆహార పదార్థాలు, కూరగాయలు నాసిరకం సరఫరా చేస్తే తహసీల్దార్లకు సమాచారం ఇవ్వాలని కలెక్టర్ తెలిపారు.

ధాన్యం కొనుగోళ్ల పరిశీలన..

మండలం పరిధిలోని రామడుగు ప్రాజెక్టు వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు పరిశీలించారు. ధాన్యం నాణ్యతను, తేమ శాతాన్ని మాయిచ్చర్ మీటర్ ద్వారా పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. రైతులకు ఇబ్బందులు లేకుండా తూకం వేయాలని కోరారు. ధాన్యం అమ్మగానే రైతుల ఖాతాల్లో డబ్బులను జమ చేస్తున్నామని కలెక్టర్ వారికి వివరించారు. తర్వాత బోనస్ డబ్బులను కూడా ఖాతాల్లో వేస్తున్నామని తెలిపారు. కలెక్టర్ వెంట ఆర్డీవో రాజేంద్రకుమార్, ధర్పల్లి ఎంపీడీవో బాలకృష్ణ, తహసీల్దార్ మాలతి పాల్గొన్నారు. అలాగే తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల్లో కొనసాగుతున్న సర్వే డాటా ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. ఏవైనా ఇబ్బందులు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. జిల్లాలో ఇప్పటి వరకు 99 శాతం ఇంటింటి సర్వే పూర్తయిందని ఆయన తెలిపారు. అన్ని గృహాలకు సంబంధించిన వివరాలను సేకరించామని కలెక్టర్ తెలిపారు.

జిల్లాలో కొనసాగుతున్న



సర్వే డాటా ఎంట్రీ

ఇప్పటి వరకు 88 వేల ఇళ్ల సర్వే పూర్తి

- రోజుకు ఎనిమిది వేలకుపైగా ఇళ్ల సమాచారం ఆన్‌లైన్‌లో నమోదు
- ఇళ్ల డాటా ఎంట్రీని పరిశీలించిన నగర కార్పొరేషన్ కమిషనర్ దిలీప్ కుమార్
- సర్వే పూర్తికాని వారి కోసం టోల్ ఫ్రీ నెంబర్ 0862-221001

సుభాష్‌నగర్, నవంబరు26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సమగ్ర సర్వే నిజామాబాద్ నగరపాలక సంస్థ పరిధిలో కొనసాగుతోంది. 60 డివిజన్లలో ప్రతిరోజూ ఎన్యుమరేటర్లు ఇంటింటికి తిరుగుతూ సర్వే నిర్వహిస్తున్నారు. సర్వే సమాచారాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. మొత్తం లక్షకు పైగా ఇళ్లు ఉండగా ఇప్పటికే 88వేలకు పైగా ఇంటింటి సర్వే పూర్తయింది. మిగతా వాటిని కూడా త్వరలోనే పూర్తిచేసి వాటి వివరాలను కూడా ఆన్‌లైన్‌లో నమోదు చేయనున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్ తెలిపారు.

రోజుకు 8వేలకు పైగా ఇళ్ల డాటా ఎంట్రీ..

నగరపాలక సంస్థ పరిధిలో పూర్తయిన ఇంటింటి సర్వే రెండు రోజులుగా డాటా ఎంట్రీ చేస్తున్నారు. రోజుకు సుమారు ఎనిమిది వేలకుపైగా ఇళ్ల సమాచారాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో డాటా ఎంట్రీ సెంటర్‌ను ఏర్పాటు చేయగా మరో సెంటర్‌ను అర్సపల్లిలో ఏర్పాటు చేశారు. ఈ రెండు సెంటర్ల ద్వారా సుమారు 180 కంప్యూటర్ల ద్వారా సమాచారాన్ని ఆన్‌లైన్ చేస్తున్నారు. ఒక్కొక్కరు ఏడు నుంచి ఎనిమిది గంటల పాటు పనిచేసి రోజుకు 35-40 ఇళ్ల సమాచారాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. గత రెండు రోజుల క్రితం ట్రైనింగ్ ఇచ్చిన వారిలో తెలుగు భాష పట్ల ఇబ్బంది ఉన్న 40మందిని తొలగించి వారి స్థానంలో భాష పట్ల పూర్తి అవగాహన ఉన్న వారిని తీసుకోనున్నారు. కంప్యూటర్లను కూడా మరో 60నుంచి 70 అదనంగా పెంచి రోజువారి డాటీ ఎంట్రీని 8వేల నుంచి 10వేలకు పెంచనున్నట్లు మున్సిపల్ కమిషనర్ తెలిపారు.

త్వరలోనే మిగిలిన ఇళ్ల సర్వే..

నగరపాలక సంస్థలో లక్షకు పైగా ఆవాసాలు ఉండగా ఇప్పటికే ఎన్యుమరేటర్లు 88వేలకు పైగా ఇండ్లలో సర్వే నిర్వహించారు. మిగిలిన ఇండ్లను సైతం త్వరలోనే సర్వే పూర్తిచేస్తామని అధికారులు తెలిపారు. చాలా డివిజన్లలో పక్క ఇళ్లలో సర్వే అయి వారి ఇళ్లలో సర్వే కాకపోవడంతో ప్రజలు ఆందోళనలో ఉన్నారు. అలాంటి వారు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రతి ఒక్క ఇంటి సర్వే చేయడం జరుగుతుందని అధికారులు తెలుపుతున్నారు. సర్వేకాని ఇంటి యజమానులు అక్కడ ఉన్న స్థానిక అధికారులను కలిసి తమ ఇంటి సర్వే చేయించుకోవచ్చని తెలిపారు. నగరపాలక సంస్థ పరిధిలో ప్రతి ఇంటికి తిరిగి సర్వే నిర్వహించి ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేయనున్నట్లు కమిషనర్ తెలిపారు.

డాటా ఎంట్రీని పరిశీలించిన నగరపాలక సంస్థ కమిషనర్..

నగరపాలక సంస్థ కార్యాలయ ఆవరణలో జరుగుతున్న కులగణన సమగ్రసర్వే డాటా ఎంట్రీని కమిషనర్ దిలీప్ కుమార్ పరిశీలించారు. ఎంట్రీ ఎలా చేస్తున్నారని ఆపరేటర్లను అడిగి తెలుసుకున్నారు. ఒక దరఖాస్తు వివరాలను ఆన్‌లైన్‌లో నమోదుకు ఎంత సమయం పడుతుందని అడిగి తెలుసుకున్నారు. జాగ్రత్తగా నమోదు చేయాలని ఆపరేటర్లను సూచించారు. త్వరితగతిన ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ పూర్తయ్యేలా చూడాలన్నారు. ఎన్యుమరేటర్లు ఎక్కడైన ఇండ్లలో స్టిక్కర్ అతికించకపోయినా, సర్వే చేయకపోయినా టోల్ ఫ్రీ నెంబర్ 08462-221001కు కాల్‌చేసి నమోదు చేయించుకోవాలన్నారు.



డాటా ఎంట్రీని పరిశీలిస్తున్న నగర కార్పొరేషన్ కమిషనర్ దిలీప్ కుమార్

బీఆర్ఎస్ కార్యకర్తలను కేసులతో వేధిస్తున్నారు

- పథకాల అమలులో సీఎం రేవంత్ రెడ్డి విఫలం
- కాంగ్రెస్‌లోకి వెళ్లినవారిని మళ్లీ బీఆర్ఎస్‌లోకి రానివ్వం
- 29న దీక్షాదివస్‌ను విజయవంతం చేయాలి
- దీక్షా దివస్ జిల్లా ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్, బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి, చిత్రంలో దీక్షా దివస్ జిల్లా ఇన్‌చార్జి ఫారుఖ్ హుస్సేన్

సుభాష్‌నగర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ కార్యకర్తలపై కేసులు పెట్టి వేధిస్తున్నారని, కార్యకర్తలు అధైర్యపడవద్దని దీక్షా దివస్ జిల్లా ఇన్‌చార్జి ఫారూఖ్ హుస్సేన్, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో మంగళవారం దీక్షా దివస్ సన్నాహక సమావేశంలో వీరు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై బీఆర్ఎస్ కార్యకర్తలు ముందుండి పోరాడాలన్నారు. పార్టీకి కార్యకర్తలే బలమన్నారు. పథకాలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. రేవంత్ సర్కార్ ఐదేళ్లు ఉండడం అనుమానమేనని ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్ అన్నారు. కాంగ్రెస్‌లోకి వెళ్లిన వారిని మళ్లీ బీఆర్ఎస్‌లోకి అనుమతించేది లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఈ సంవత్సర కాలంలో 63 ఎమ్మెల్యేల నుంచి 71ఎమ్మెల్యేల దాకా అభివృద్ధి చెందిందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. రానున్న ప్రభుత్వం బీఆర్ఎస్ ప్రభుత్వమేనన్నారు. కాంగ్రెస్ పాలనపై ఏడాదిలో తీవ్ర వ్యతిరేకత మొదలైందని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. తెలంగాణలో రేవంత్ గ్రాఫ్ పడిపోయినట్లు సర్వేలు చెబుతున్నాయన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు, 13 హామీలపై ప్రజలు నిలదీయాలన్నారు. స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ కార్యకర్తలు సత్తా చాటాలన్నారు. నవంబర్ 29న నిర్వహించనున్న దీక్షాదివస్ సన్నాహక సమావేశంలో నియోజ.కవర్గం నుంచి వెయ్యి మందికిపైగా కార్యకర్తలు వచ్చే విధంగా చూసుకోవాలన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవన్ రెడ్డి మాట్లాడుతూ.. పది సంవత్సరాల్లో కేసీఆర్ ప్రజల్లో వెలుగులు నింపితే రేవంత్ రెడ్డి చీకటి నింపుతున్నాడన్నారు. కాంగ్రెస్ నాయకులను తరిమికొట్టడానికి దీక్షాదివస్ కార్యక్రమం మొదటి కార్యక్రమం అవుతుందన్నారు. పోలీసులు సైతం కార్యకర్తలపై కేసులు పెడుతున్నారని దాడులు చేసే పోలీసులను పింక్‌బుక్‌లో ఎక్కిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు బిగాల గణేష్ గుప్త, బాజిరెడ్డి గోవర్ధన్, మాజీ ఎమ్మెల్సీ వీజీగౌడ్, మాజీ జడ్పీ ఛైర్మన్ విఠల్‌రావు, మాజీ రెడ్‌కో ఛైర్మన్ అలీం, పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

ఆటల్లో మెరికలు.. ఈ అమ్మాయిలు

- మైదానంలోకి దిగితే చిరుతలే
- క్రీడల్లో రాణిస్తున్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థినులు
- జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

7



రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలో మొదటి విజేతగా ట్రోఫీ అందుకుంటున్న మగ్గిడి విద్యార్థినులు





అర్ధాకలితో.. 'పది' విద్యార్థులు!

- జిల్లాలో ప్రారంభమైన పదో తరగతి ప్రత్యేక తరగతులు
- విద్యార్థుల అల్పాహారంపై స్పష్టత కరువు
- దాతల సహకారం కోసం ఎదురు చూపులు
- జిల్లాలో 11వేలకు పైగా ప్రభుత్వ పదో తరగతి విద్యార్థులు

నిజామాబాద్ అర్బన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): వచ్చే పదో తరగతి వార్షిక పరీక్షల్లో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించడమే లక్ష్యంగా జిల్లా విద్యాశాఖ సిద్ధమవుతోంది. ఈ మేరకు జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఉదయం, సాయంత్రం గంట చొప్పున సబ్జెక్టుల వారీగా ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నారు. నవంబరు1న ఈ ప్రత్యేక తరగతులను జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రారంభించారు. ఉదయాన్నే ఇంటి నుంచి బయలుదేరే విద్యార్థులు 8గంటల నుంచి 9గంటల వరకు స్పెషల్ తరగతులు ఆ తర్వాత పాఠశాలకు వెళ్తున్నారు. దీంతో మధ్యాహ్నం భోజనం వరకు ఆకలితో ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. స్పెషల్ తరగతులు ప్రారంభించాలని విద్యాశాఖ ఆదేశాలు ఇచ్చినప్పటికీ విద్యార్థులకు అల్పాహారం విషయంలో ఎలాంటి నిధులు విడుదల చేయకపోవడంతో విద్యార్థులంతా అర్ధాకలితో చదువుకుంటున్నారు. మధ్యాహ్నం భోజనం తర్వాత తిరిగి పాఠశాల పూర్తయినప్పటికీ సాయంత్రం 4.15 గంటల నుంచి 5.15 గంటల వరకు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నారు. తిరిగి ఇంటికి వెళ్లేవరకు కూడా వారికి భోజనం దొరకని పరిస్థితి ఉంది. అసలే వార్షిక పరీక్షలకు విద్యార్థులు సిద్ధమవుతుంటే అర్ధాకలితో స్పెషల్ తరగతులకు హాజరైతే వారు చదివేది కూడా అర్థం కాని పరిస్థితి ఉంటుంది. కడుపునిండా ఆహారం ఉంటేనే పిల్లలు ఏకాగ్రతతో చదివే అవకాశం ఉంటుంది. స్పెషల్ తరగతులు నిర్వహించాలని విద్యాశాఖ ఆదేశాలు ఇచ్చినప్పటికీ అల్పాహారం అందించే విషయంలో ఇప్పటికీ ఎలాంటి స్పష్టత లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

పేద విద్యార్థుల ఇబ్బందులు..

ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఉదయం 8గంటలకే పాఠశాలలకు వస్తున్నారు. దూర ప్రాంతాల వారు ఉదయం 7గంటల నుంచే ఇంటి నుంచి బయలుదేరి పాఠశాలలకు వస్తున్నారు. ఇతర తరగతుల విద్యార్థుల లాగే మధ్యాహ్నం 12.40 గంటలకు మధ్యాహ్న భోజనం చేస్తున్నారు. తిరిగి సాయంత్రం 4.15 గంటల నుంచి 5.15 గంటల వరకు ప్రత్యేక తరగతులకు హాజరవుతున్నారు. తిరిగి విద్యార్థులు ఇంటికి వెళ్లే సరికి సాయంత్రం 6 గంటలకు పైగా సమయం అవుతుంది. దీంతో ఇంటికి వెళ్లేంతవరకు విద్యార్థులకు ఆహారం అందడం లేదు. ముఖ్యంగా పేద విద్యార్థులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ప్రత్యేక తరగతుల్లో గతంలో దాతల సహకారంతో, ప్రభుత్వం సైతం అల్పాహారం అందించేది. కానీ ఈ యేడాది నవంబరు 1 నుంచి సుమారు 26 రోజులుగా స్పెషల్ తరగతులు ప్రారంభమైనప్పటికీ అల్పాహారం అందించడం లేదు. ప్రభుత్వ పాఠశాలల్లో ఎక్కువగా చదివే పేద విద్యార్థులే ఉన్నందున వారికి ఇంటివద్ద సరైన పౌష్టికాహారం అందదు. పాఠశాలల్లోనైనా సరైన పౌష్టికాహారం అందుతుందని ఆశ ఉన్నప్పటికీ స్పెషల్ తరగతులకు ఎలాంటి అల్పాహారం అందించకపోవడంతో వారంతా అనారోగ్యానికి గురవుతున్నారు. దీంతో చదువుపై ఏకాగ్రతను పెట్టకపోవడంతో వారంతా చదువుల్లో వెనుకబడుతున్నారు.

గతంలో దాతల సహకారంతో..

గతంలో జిల్లాలో కలెక్టర్‌గా పనిచేసిన యోగితారాణా పదో తరగతి విద్యార్థులకు స్పెషల్ క్లాసులు నిర్వహించే సమయంలో దాతల సహకారంతో అల్పాహారం ఏర్పాటు చేశారు. గతంలో ఎంపీగా పనిచేసిన కవిత సైతం 'ప దో' తరగతి విద్యార్థుల స్పెషల్ క్లాసుల అల్పాహారానికి కృషి చేశారు. జిల్లాలో 250కి పైగా ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 11వేల వర కు పదో తరగతి విద్యార్థులు చదువుతున్నారు. 2020-21 విద్యాసంవత్సరంలో దాతల సహకారంతో పదో తరగతి విద్యార్థులకు స్నాక్స్ అందజేశారు. 2021-22, 2022-23 విద్యాసం వత్సరాల్లో విద్యార్థులకు ఎలాంటి స్నాక్స్ అందించలేదు. ఈ విద్యాసంవత్సరం కూడా అల్పాహారంపై ఎలాంటి ఉత్తర్వులు అందలేదు. గతంలో రైస్‌మిల్లర్లు, ఇతర పారిశ్రామిక వేత్తలు, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అల్పాహారం విషయంలో ముందుకు వచ్చి సహకారం అందించారు. ఇప్పటికైనా కలెక్టర్ చొరవ తీసుకొని పారిశ్రామిక వేత్తలు, రైస్‌మిల్లర్లు, పరిశ్రమల యజమానులతో మాట్లాడి పేద విద్యార్థులకు అల్పాహారం అందించే విషయంలో స్పందించాలని విద్యార్థులు కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం..



: అశోక్, జిల్లా విద్యాశాఖ అధికారి

పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతుల్లో అల్పాహారం అందించేందుకు ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ఉత్తర్వులు రాలేదు. అల్పాహారం అందించే విషయంలో కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి ఉన్నతాధికారులకు నివేదిస్తాం. ఈ విషయమై ఇప్పటికే విద్యార్థుల నుంచి వినతులు వస్తున్నాయి. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగిన విధంగా ఏర్పాట్లు చేస్తాం.

ఉమ్మడి జిల్లా అంతటా ఘనంగా భారత రాజ్యాంగ దినోత్సవం



కుకునూర్‌లో మానవహారంగా ఏర్పడి రాజ్యాంగం అనే అక్షరాలను ఏర్పర్చిన దృశ్యం



ఆర్మూర్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న మున్సిపల్ అధికారులు



కామారెడ్డిలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న నాయకులు



మద్నూర్‌లో భారత రాజ్యాంగాన్ని గౌరవిస్తామని ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

బోధన్‌రూరల్,నవంబరు26(ఆంధ్రజ్యోతి): సాలూర మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం భారత రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులచే భారత రాజ్యాంగ పీఠికను తెలుగు, ఆంగ్లంలో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి మంజూష మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగ రచనలను, చేసిన కృషిని కొనియాడారు. హక్కులతో పాటు బాధ్యతలు కూడా కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకట రత్నం, ఉపాధ్యాయులు విజయ్ కుమార్, గంధపు సాయిలు, దండు రాజ్‌కుమార్, గాండ్ల అబ్బయ్య, అరుణ్ కుమార్, స్వామి, సంగీతరావు, సంతోష్, యాదవ రావు, తదితరులు పాల్గొన్నారు.

నవీపేట: మండల కేంద్రంలో మంగళవారం భారత రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. జన వికాస్ సేవ సంస్థ ఆధ్వర్యంలో బస్టాండ్ సమీపంలో ఉన్న భారత రాజ్యాంగ నిర్మాణ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జన వికాస్ సేవ సంస్థ జిల్లా అధ్యక్షులు తెడ్డు పోశెట్టి, నవీపేట సొసైటీ వైస్ చైర్మన్ ప్రవీణ్ కుమార్, మోహన్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

ఎర్గట్ల: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణచారి మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని అందరు గౌరవించాలని, భారతదేశ జాతీయ సమైఖ్యతను కాకాపాడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మునీరుద్దీన్, ప్రసాద్, విజయ్, ప్రవీణ్ శర్మ, గంగాధర్, సబిత, సమత, విద్యార్థులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి:మండల కేంద్రంలో మంగళవారం 75వ రాజ్యాంగ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామపంచాయతీ కార్యాలయం ఎదురుగా ఉన్న భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి మండల ఎంపీడీవో రాజా శ్రీనివాస్, మండలకాంగ్రెస్ అధ్యక్షుడు సుంకెటరవి, పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో, రాజా శ్రీనివాస్ కాంగ్రెస్ నాయకులు సుంకెట రవి, నిమ్మ ప్రసాద్, బుచ్చిమల్లయ్య, ఊట్నూర్ ప్రదీప్, సుంకెట శ్రీనివాస్, అజాహరోద్దీన్, ఏపీవో విద్యానంద్, పంచాయతీ కార్యదర్శి గంగజమున, మండల పరిషత్‌కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నసురుల్లాబాద్: మండల కేంద్రంలోని సమీకృత భవ నంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో మంగళవారం అధికారులు, నాయకులు రాజ్యాంగ అవతరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ బావయ్య, ఇంచార్జి ఎంపీడీవో సూర్యకాంత్, మండల ప్రత్యేక అధికారి దయానంద్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

లింగంపేట: భారత రాజ్యంగం ప్రపంచానికి ఆదర్శం అని లింగంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నరెందర్ అన్నారు. ఆయన మంగళవారం కళాశాలలో నిర్వహించిన రాజ్యంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. దేశంలోని అన్ని వర్గాల ప్రజలకు స్వేచ్ఛ, సమానత్వం, సౌభద్రత్వం, న్యాయం జరిగేలా రాజ్యంగం రచించారని రాజ్యంగం గురించి ప్రతీ ఒక్కరు తెలుసుకోవాలని ఆయన తెలిపారు. ఒక సామాన్యుడు ప్రధాని, రాష్ట్రపతి కావడానికి రాజ్యంగంతోనే సాధ్యమని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు, లెక్చరర్లు రాజ్యంగ పీఠికను ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో లెక్చరర్లు ఉపాధ్యాయులు ఉన్నారు.

కామారెడ్డిటౌన్: కామారెడ్డి జిల్లా కేంద్రంలోని రైల్వే కమాన్ వద్ద గల డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి మంగళవారం పూలమాలలు వేసి అంబేద్కర్‌యువజన సంఘం నాయకులు నివాళ్లు అర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1949 నవంబరు 26న రాజ్యాంగం అమలులోకి వచ్చిందని దేశ ప్రజలందరికి న్యాయం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం కల్పించిన రోజు అని అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ కౌన్సిలర్ సంగీమోహన్,నాయకులు శ్రీనివాస్, ప్రవీణ్, వేణుగోపాల్, నరేందర్,శేఖర్, అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.

తాడ్వాయి: మండలంలోని వివిధ గ్రామ పంచాయితీలలో ఘనంగా ప్రజా పాలన దినోత్సవాన్ని నిర్వహించినట్లు మండల అధికారులు తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రజా పాలన దినోత్సవాలను జరుపుకోమని తెలుపుగా అందులో భాగంగా గ్రామ పంచాయితీలో సిబ్బందికి శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి రాజారాం, మండల అభివృద్ధి అధికారి సయ్యద్ సాజీద్ అలీ, ఎంపీవో సవితారెడ్డి, ఆయా గ్రామాల కార్యదర్శులు, అధికారులు ఉన్నారు.

మద్నూర్: దేశ ప్రజలందరికీ న్యాయం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వాలను అందిస్తూ రూపొందించబడిన భారత రాజ్యాంగం ఆమోదం పొందిన 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా మద్నూర్ బాలుర గురుకుల పాఠశాలలో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ గంగాకిషోర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పెద్దకొడప్‌గల్: మండలంలోని కాటేపల్లి గ్రామంలో మంగళవారం భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్ర పటానికి పూల మాల వేశారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి ప్రదీప్, గ్రామ నాయకులు మల్లప్ప పటేల్, మొగులాగౌడ్, ఇస్మాయిల్ పటేల్,గంగాగౌడ్, యూసుప్ పటేల్, హాజి, చాంద్, అశోక్, శ్రీను, పాష, బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని కోర్టు ఆవరణలో బారత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భారత రాజ్యంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారత రాజ్యంగ నిర్మాణకర్త బీఆర్.అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు తెడ్డు నర్సయ్య, ఉపాధ్యక్షుడు కోడెటి శంకర్, న్యాయవాదులు జక్కుల శ్రీధర్, రామకృష్ణ, కిష్టయ్య, సుబాష్, తదితరులు పాల్గొన్నారు.

● మున్సిపల్ కార్యాలయంలో

పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో భారత రాజ్యంగం దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ రాజు అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు శేఖర్, సలీం, ఆంజనేయులు, పూర్ణమౌళి, వెన్న మోహన్, రాజలింగం, సంపత్, నరేష్, జిన్న, తదితరులు పాల్గొన్నారు.

● మాదిగ సంఘాల యునైటెడ్ ఫ్రంట్ ఆధ్వర్యంలో

పట్టణంలోని అంబేద్కర్‌చౌరస్తాలో మాదిగ సంఘాల యునైటెడ్ ఫ్రంట్ ఆధ్వర్యంలో భారత రాజ్యంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాచవల్ పెద్ద దేవయ్య, గంగోని స్వామి, తెడ్డు నర్సయ్య, చిన్నయ్య, సాయన్న, గంగారాం, గోపి, శేఖర్, సునంది, పాల్గొన్నారు.

పెర్కిట్: భారత రాజ్యంగా దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం పట్టణంలోని అంబేద్కర్‌చౌరస్తాలో బీజేపీ నాయకులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు జెస్సు అనిల్, కలిగోట గంగాధర్, బీజే పీ నాయకులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దాసు అధ్యాపకులు పాల్గొన్నారు.

వేల్పూర్: మండలంలోని మోతె, కుకునూర్, వేల్పూర్, పచ్చల నడ్కుడ, పడిగెల, అంక్సాపూర్ , తదితర పాఠశాలల్లో, అలాగే వేల్పూర్ కృష్ణవేణి, రామన్నపేట్ అంబేద్కర్ యువజన సంఘంలో 75వ రాజ్యంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కుకునూర్‌లో విద్యార్థులు మానవహారంగా ఏర్పడి రాజ్యంగం అనే అక్షరాలను ఏర్పర్చారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

పడిగెల పాఠశాలలో స్వయం పాలన దినోత్సవం



పడిగెల పాఠశాలలో స్వయం పాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

వేల్పూర్, నవంబరు26(ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండలం పడిగెల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులు స్వయం పాలన దినోత్సవాన్ని కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పదోతరగతి విద్యార్థులు ఉపాధ్యాయులుగా విధులు నిర్వహించి తమకు పాఠాలు బోధించే ఉపాధ్యాయులు పడే ఇబ్బందులను స్వయం పాలన దినోత్సవం సందర్భంగా తెలుసుకోగలిగమన్నారు. ప్రధానోపాధ్యాయులుగా విద్యార్థి కె.సుశాంత్, ఉపాధ్యాయులుగా కిరణ్, ఆలుక, స్పందన, గంగప్రసాద్, భరత్, బాబురావు, మనశ్విని, లిఖిత, హనిలు ఉన్నారు. స్వయం పాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు.

వచ్చే ఎన్నికలల్లో బీజేపీదే విజయం

● బీజేపీ రాష్ట్ర నాయకులు మేడపాటి ప్రకాష్ రెడ్డి

బోధన్‌రూరల్,నవంబరు26(ఆంధ్రజ్యోతి): మహరాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలలో బీజేపీ ఘన విజయం సాధించడం అభినందనీయమని, తెలంగాణలో మళ్లీ వచ్చే ఎన్నికలలో మహరాష్ట్ర ఎన్నికల ఫలితాలే పునరావృతం అవుతాయని బీజేపీ రాష్ట్ర నాయకులు మేడపాటి ప్రకాష్ రెడ్డి అన్నారు. మంగళవారం బోధన్‌లోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహరాష్ట్రలో అత్యధిక మెజారిటీతో అత్యధిక స్థానాలలో బీజేపీ పార్టీ గెలిచిందని, ఈ సందర్భంగా మహరాష్ట్ర వాసులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణలో వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలలో మున్సిపాలిటీ ఎన్నికలలో బీజేపీ ఘన విజయం సాధిస్తుందన్నారు. రాష్ట్రంలో బీజేపీ పార్టీ బలోపేతం అవుతుందని, అత్యధిక స్థానాల్లో బీజేపీ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వస్తే పేదలందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మాలల సింహగర్జన పోస్టర్ల ఆవిష్కరణ

నందిపేట, నవంబరు26: మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో మంగళవారం చలో హైదరాబాద్ మాలల సింహగర్జన పోస్టర్లను ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర కో చైర్మెన్ అంగరి ప్రదీప్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 1వ తేదీనా హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్లో మాలల అస్తిత్వం, ఆత్మ గౌరవం, ఐక్యత, అభివృద్ధి, ఎస్సీ రిజర్వేషన్లు వర్గీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న మాలల సింహగర్జనను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ప్రభుత్వ అనుమతితో జరుగుతున్న సింహగర్జనకు ప్రతీ మాలలు తరలి రావాలని ప్రదీప్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి నందిపేట మండలం జేఏసీ నాయకులు కోమన్‌పల్లి రాజన్న, నాయకులు బోర్రోల్ల సురేష్, సుంకరి నాగరాజు, బంటు రాజేశ్వర్, ఏర్రటి మోహన్, మాయాపూర్ జీవన్, ద్యావతి మురళి, రవి, అశోక్, భూమేష్, విష్ణు తధితరులు ఉన్నారు.

కొత్తపల్లిలో ఘనంగా బీమన్న ఉత్సవాలు

ముప్కాల్, నవంబరు26(ఆంధ్రజ్యోతి) ముప్కాల్ మండలం కొత్తపల్లి గ్రామంలో బీమన్న ఉత్సవాలు ఆదివాసి నాయకపోడు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సురం రాజేందర్, సాగర్, శేఖర్, సాయన్న, శివకుమార్, దేవదాస్, రాజేంధర్, చంద్రశేఖర్, శివశంకర్, రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

వేల్పూర్, నవంబరు26(ఆంధ్రజ్యోతి): మండలంలోని పచ్చలనడ్కుడ గ్రామం లో లబ్ధిదారులకు మంజూరైన సీఎం రిలిఫ్ ఫండ్ చెక్కులను మంగళవారం కాం గ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు గుడాల మోహన్, కిసాన్‌సెల్ జిల్లా వైస్‌ప్రెసిడెంట్ టక్కరి గంగాధర్‌లు అందజేశారు. రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి సహకారంతో సీఎం రిలిఫ్ ఫండ్ చెక్కులు మంజూరయ్యాయని, ఈ సందర్భంగా అన్వేష్‌రెడ్డికి లబ్ధిదారులు, నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గట్టువుతాల నర్సారెడ్డి, మండల భోజన్న, కుర్మ సాయిరాం, ఎంగంటి నెహ్రు, లింగేశ్వర్, తదితరులు ఉన్నారు.

గిరిజన విద్యార్థిని శైలజ మృతి ప్రభుత్వ హత్యే

● లంబాడి హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు మోహన్‌నాయక్

జక్రాన్‌పల్లి, నవంబరు26(ఆంధ్రజ్యోతి): కొమురభీం జిల్లా వంకాడి గిరిజన ఆశ్రమ పాఠశాలలో విద్యార్థిని శైలజ మధ్యాహ్న భోజనం తిని అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందగా ఇదీ ప్రభుత్వ హత్యేనని లంబాడి హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు మోహన్‌నాయక్‌చౌహన్ ఆరోపించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ గిరిజన విద్యార్థిని మృతిపై హైకోర్టు జడ్జిచే న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. విద్యార్థిని సహజ మృతి పట్ల ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి కనబర్చిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 11నెలలు కావస్తున్న ఆశ్రమ పాఠశాలలో, గురుకుల పాఠశాలలో సంక్షేమ శాఖ హాస్టళ్ళను నిర్లక్ష్యం చేస్తూ ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థుల చదువులకు దూరం చేయాలనే దురుద్దేశంతో ప్రభుత్వం వ్యవహరిస్తూ తీరును శోచనీయమన్నారు. విద్యార్థిని శైలజ మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రభుత్వం గిరిజన విదార్థుల పట్ల నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. విద్యార్థిని శైలజ మృతిపై ప్రభుత్వం బాధ్యత వహించాలని లంభాడ హక్కుల పోరాట సమితి డిమాండ్ చేస్తుందన్నారు.

విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థానం పొందాలి

● బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి



మోకన్‌పల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

నవీపేట,నవంబరు26(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు బాగా చదివి మంచి ఉన్నత స్థానం పొందాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి కోరారు. మంగళవారం మండంలోని మోకన్‌పల్లి కస్తూర్బా బాలికల పాఠశాలలో పీఎంఎస్‌హెచ్‌ఆర్‌ఐకి చెందిన 85.50లక్షల నిధులతో చేపట్టిన అదనపు గదుల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు. కస్తూర్బా బాలికల పాఠశాలలో వేడి నీటి వసతితో పాటు ఫర్నిచర్ అందించాలని పలువురు ఎమ్మెల్యేను కోరగా వెంటనే తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులతో స్వయంగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అంతకు ముందు నవీపేట ప్రభుత్వ ఆసుపత్రిలో 15లక్షల రూపాయల వ్యయంతో చేపట్టిన ప్రహరి గోడ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఆసుపత్రిలోని పలు వార్డులను పరిశీలించారు. రోగులకు సరైన వైద్య సేవలు అందించాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం కమలాపూర్‌లో 5లక్షల రూపాయలతో చేపట్టిన ఫార్మేషన్ రోడ్డుకు భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు అంతిరెడ్డి రాజిరెడ్డి, డీఈవో అశోక్, డిప్యూటీ డీఎంహెచ్‌వో అంజనా, నిజామాబాద్ ఏఎంసీ వైస్ చైర్మన్ రాంచందర్, శ్రీనివాస్ గౌడ్, రాజేందర్ గౌడ్, గోవర్ధన్ రెడ్డి, మహిపాల్ రెడ్డి, మోస్రా సాయిరెడ్డి, కోటిరెడ్డి, బాల్‌రాజు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

● ఎమ్మెల్యేకు వినతిపత్రం సమర్పించిన సమగ్ర శిక్షా ఉద్యోగులు

తెలంగాణ సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం మండల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు.ఈ మేరకు మండలంలోని మోకన్‌పల్లి కస్తూర్బా బాలికల పాఠశాలలో జరిగిన అభివృద్ధి పనుల శంకుస్థాపనకు వచ్చిన ఆయనను ఉద్యోగులు కలిసి తమ వినతిపత్రాన్ని అందజేశారు. తమ ఉద్యోగాలను వెంటనే రెగ్యులర్ చేయాలని వారు తమ వినతిపత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ప్రత్యేక అధికారిణి కవిత, సంఘం మండల అధ్యక్షులు రాకేష్, ఇతర సిబ్బంది ఉన్నారు.

బీజేపీలో చేరిన పద్మశాలి నాయకులు



ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరిన పద్మశాలి సంఘ నాయకులు

ఆర్మూర్‌రూరల్, నవంబరు26(ఆంధ్రజ్యోతి) ఆర్మూర్ పట్టణానికి చెందిన వివిధ తర్పాల పద్మశాలి సంఘం నాయకులు మంగళవారం మండలంలోని అంకాపూర్ గ్రామంలో ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. పద్మశాలి సంక్షేమ సేవ సమితి అధ్యక్షుడు మ్యాక మోహన్‌దాస్, వంగ వివేక్, ఒకటోవ తర్ప అధ్యక్షుడు నూకల నారాయణ, రెండవ తర్ప అధ్యక్షుడు బండి అనంత్‌రావు, నాల్గవ తర్ప అధ్యక్షుడు రుద్ర రాజేశ్వర్, ఏడవ తర్ప అధ్యక్షుడు సదామస్తుల గణపతి, మామిడిపల్లి రెండవ తర్ప మాజీ అధ్యక్షుడు ఎడెల్లి శ్రీనివాస్, అందె నాగేశ్వర్‌రావు, ఏలిగేటి విఠల్, లింగోజి, గణేష్, తదితరులు బీజేపీలో చేరగా ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి వారికి పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ



ఆశాజ్యోతి కాలనీలో జరిగిన ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొన్న అడిషనల్ కలెక్టర్

నవీపేట,నవంబరు26(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆశాజ్యోతి కాలనీలో జియోటెక్ ఇన్‌ప్రాస్ట్రక్చర్ క్రషర్‌లో పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. జియోటెక్ క్రషర్‌లో 8.09 సెక్టార్లలో విస్తీర్ణంలో కంకర క్వారీ ఏర్పాటుకు సంబంధించి సమీప గ్రామాలకు చెందిన ప్రజల నుండి అభిప్రాయం సేకరించారు. క్రషర్‌లో కంకర క్వారీ ఏర్పాటుకు తమకు ఎటువంటి అభ్యంతరం లేదని స్థానికులు తమ అభిప్రాయం వెలుబుచ్చారు. ఈ అభిప్రాయ సేకరణలో సమీప గ్రామాల ప్రజలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ కిరణ్ కుమార్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ లక్ష్మణ్ బాబు, నిజామాబాద్ ఏసీపీ రాజా వెంకట్ రెడ్డి, నాయబ్ తహసీల్దార్ తెలంగ్ రావు, కంకర క్వారీ యజమాని సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు నసురుల్లాబాద్ గిరిజన గురుకుల విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల ఉపాధ్యాయ బృందం

నసురుల్లాబాద్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): అథ్లెటిక్ అసోసియేషన్ కామారెడ్డి జిల్లా ఆధ్వర్యంలో జిల్లాస్థాయిలో ఉత్తమ ప్రతిభను కనబరిచిన విద్యార్థులకు మంగళవారం పాఠశాల ఉపాధ్యాయ బృందం అభినందించారు. ఈ సందర్భంగా గిరిజన పాఠశాల ప్రిన్సిపాల్ మాధవరావు మాట్లాడుతూ యూ/10 విభాగంలో ఈశ్వర్ 5వ తరగతి లాంగ్ జంప్‌లో వెండి పతకం, సునీల్‌కు 5వ తరగతి 300 మీటర్స్ పరుగు పందెంలో కాంస్య పతకం, యూ12 విభాగంలో దేవిదాస్ 5వ తరగతి 400 మీటర్ పరుగు పందెంలో బంగారు పతకం, చందర్పన్ 5వ తరగతి 600 మీటర్ల కిడ్స్ జావలిన్ త్రో బంగారు పతకం, రాణా ప్రతాప్ 7వ తరగతి షాట్‌పుట్‌లో బంగారు పతకం, అలాగే లాంగ్ జంప్ పతకం సాధించి గిరిజన గురుకుల పాఠశాల విద్యార్థులు మంచి ప్రతిభను కనబరిచారన్నారు.వీటిని ప్రిన్సిపాల్‌మాధవరావు, వైస్‌ప్రిన్సిపాల్,టీచర్లు, సిబ్బంది, అభినందించారు.

గుర్తుతెలియని శవం లభ్యం

ఆర్మూర్‌టౌన్ నవంబరు26(ఆంధ్రజ్యోతి): మండలంలోని చేపూర్ శివారులో సోమవారం అర్ధరాత్రి గుర్తుతెలియని శవం (55) లభ్యమైనట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు. గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో సదరు వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిసింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని ఆయన తెలిపారు. ఎవరైనా గుర్తుపట్టాని యేడల స్థానిక పోలీస్‌స్టేషన్‌లో లేదా 8712659858, 9440140022నెంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌ను కలిసిన నాయకులు

తాడ్వాయి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో జరిగిన 75వ రాజ్యాంగ దినోత్సవ వేడుకలలో భాగంగా రాహుల్ గాంధీ, ఖర్గే, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నాగరి గారి ప్రీతంను జిల్లా, మండల నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. కలిసిన వారిలో జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు మద్దెల భాగయ్య, తాడ్వాయి మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు గైని శివాజీ తదితరులు ఉన్నారు.

పచ్చలనడ్కుడలో షెడ్డు నిర్మాణానికి భూమిపూజ

వేల్పూర్, నవంబరు26(ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండలం పచ్చల నడ్కుడ గ్రామంలో నిర్మించనున్న షెడ్డుకు మంగళవారం గ్రామ అధికారులు భూమిపూజ చేశారు. ఈ షెడ్డు నిర్మాణం ఆశల అనిత గారికి మంజూరు చేయడం జరిగిందని అధికారులు అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సెక్రెటరీ నవనీత, జ్యోతి, ఫీల్డ్ అసిస్టెంట్ వనిత, కాంగ్రెస్ నాయకులు గుడాల మోహన్, టక్కరి గంగాధర్, నర్సారెడ్డి, కృపాల్, రాజేంధర్, హన్మాండ్లు, భోజన్న, వంశీ, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

వీధి కుక్కల దాడిలో ఒకరికి గాయాలు



గాయపడిన సోఫీ

ఎడపల్లి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ఎడపల్లి మండలంలోని గ్రామాలలో ప్రతి రోజు ఎక్కడో ఒకచోట వీధి కుక్కలు దాడులు చేస్తూనే ఉన్నాయి. వీధి కుక్కల దాడులతో మండల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. మంగళవారం మండలంలోని ఏఆర్పీ క్యాంపు గ్రామంలో వీధి కుక్కలు సోఫీ అనే వ్యక్తిపై దాడి చేయగా అతనికి తీవ్రగాయాలు అయ్యాయి. ఇది గమనించిన స్థానికులు కుక్కలను వెళ్లగొట్టి గాయపడిన వ్యక్తిని బోధన్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. గ్రామాలలో వీధి కుక్కల సమస్య అధికమయినా అధికారులు పట్టించుకోవడం లేదని, వాటి నివారణకు చర్యలు తీసుకొని కుక్కల దాడుల నుండి మను షులను కాపాడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ప్రతిపక్షాలు తప్పుదోవ పట్టించడం మానుకోవాలి

● మానాల మోహన్‌రెడ్డి



కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న మానాల మోహన్‌రెడ్డి

ముప్కాల్, నవంబరు26(ఆంధ్రజ్యోతి) బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు ప్రజలను తప్పుదోవ పట్టించి అబద్ధపు మాట్లాడుతున్నారని సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం బాల్కొండ, ముప్కాల్ మండలాల్లోని పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. బీఆర్ఎస్ నాయకులు భయాందోళనకు గురి చేయడం వల్ల రైతులు ప్రైవేటు వ్యక్తులను ఆశ్రయించి వరిధాన్యాన్ని ప్రైవేటు దళారులను నమ్మి పంటను అమ్ముకోవడం జరిగిందని, ప్రైవేటు వ్యక్తులను ఆశ్రయించడం వల్ల రైతులు నష్టపోయిన రైతులకు బీఆర్ఎస్, బీజేపీ నాయకులే నష్టపోయిన రైతులకు ఎవరు బాధ్యత వహిస్తారని ఆయన ప్రశ్నిం చారు. బీఆర్ఎస్, బీజేపీ నాయకుల మాటలు నమ్మి అధైర్యపడ వద్దని, కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను ఒక్కొక్కటి పూర్తి చేస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మోహీనోద్దిన్, వేల్పూర్ మార్కె ట్ కమిటీ చైర్మన్ ముత్యంరెడ్డి, ముప్కాల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముత్యంరెడ్డి, సొసైటీ చైర్మన్ జక్క రాజేశ్వర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ చంద రవి, కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు బద్దం సాగర్, తదితరులు పాల్గొన్నారు.

మెండోరలో పశువుల షెడ్డుకు భూమిపూజ

భీమ్‌గల్‌రూరల్, నవంబరు26(ఆంధ్రజ్యోతి): మండలంలోని మెండోరలో ఉపాధి హామీ పథకం కింద మంజూరైన పశువుల షెడ్డును మంగళవారం అధికారులు భూమిపూజ చేశారు. ఈ సెడ్డు నిర్మాణానికి లబ్ధిదారుడు నర్సయ్యకు రూ.లక్ష మంజూరు కాగా భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ దిప్పన్, ,రాజేశ్వర్‌గౌడ్, డీసీసీ డెలిగేట్ కుంట రమేష్, పంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో స్కూళ్ల పరిశీలించిన

ఆర్మూర్‌టౌన్ నవంబరు26(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని మోడల్ స్కూల్, ట్రైబర్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ చీమన్‌పల్లిలను మంగళవారం మున్సిపల్ కమిషనర్ రాజు పరిశీలించారు. పాఠశాలలోని పరిసరాలతో పాటు బాత్‌రూం, వంట గదులను ఆయన పరిశీలించి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందజేయాలని సూచించారు. పాఠశాలలో కిటికిలు, బాత్‌రూం డోర్‌లను ఎప్పటికప్పుడు రిపేర్ చేయించాలని అధికారులకు తెలియజేశారు. అనంతరం విద్యార్థుతో మాట్లాడి హాస్టళ్లలో నెలకొన్న సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట సానిటరీ ఇన్‌స్పెక్టార్ గజానంద్, పూర్ణమౌళి, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

కోటగిరి: పొతంగల్ మండలంలోని టాక్లీ గ్రామంలో ప్రాథమిక పాఠశాలను మంగళవారం ఎంఈవో లోల శంకర్ తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో చందర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఏర్గట్ల: మండల కేంద్రంలోని కేజీబీవి పాఠశాలను మగళవారం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సదానంద్ పరిశీలించారు. విద్యార్థుల తరగతి గదులు, వంట గది, విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు అడిగి తెలుసుకొని రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ కిరణ్, ఎస్‌వో సంధ్య పాల్గొన్నారు.

భీమ్‌గల్: వసతి గృహంలో వంట ప్రదేశాలలోని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని మున్సిపల్ కమిషనర్ రామకృష్ణ తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం పట్టణ కేంద్రంలోని బాలుర వసతి గృహాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వసతిగృహంలోని వంట శాలలో కూరగాయలు, బియ్యం, పప్పుదినుసులను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని, వంట ప్రదేశంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని నిర్వాహకులకు కమిషనర్ సూచించారు. అలాగే మైనారిటీ పాఠశాలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ అజయ్, పవర్ తనిఖీ చేశారు. వీరి వెంట సిబ్బంది ఉన్నారు.



వంటశాలను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రాజు



ఖేల్

వాలీబాల్ టోర్నీలో తలపడుతున్న విద్యార్థినులు (ఫైల్)



విజ్ఞత, మగ్గిడి



కె.శ్రీనిధి మగ్గిడి

ఆటల్లో మెరికలు.. ఈ అమ్మాయిలు!

- క్రీడా అంశం ఏదైనా.. మైదానంలోకి దిగితే చిరుతలే. ● క్రీడల్లో రాణిస్తున్న ఆర్మూర్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థినులు
- తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో జాతీయ, రాష్ట్ర స్థాయిలో రాణింపు

ఆర్మూర్ రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పొద్దస్తమానం ఆటలేనా..? ఆటలు తిండిపెడతాయా? అని కసురుకునే తల్లి దండ్రులు ప్రతీ ఇంటిలో ఉన్నారు ఎందరో ఉన్నారు. కానీ తమ పిల్లలను క్రీడల్లో ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులు కూడా ఉన్నారు. ఆటలు తిండిపెడతాయా అని ఈసడించుకున్న తల్లిదండ్రులే తమ పిల్లలు ఆటల్లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తూ కీర్తి సంపాదిస్తుంటే మురిసిపోతున్నారు, గ్రామీణ ప్రాంతంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మెరికలు లాంటి అమ్మాయిలు క్రీడల్లో పాల్గొని రాణిస్తున్నారు. క్రీడా అంశం ఏదైనా వారు మైదానంలో దిగితే చిరుతలే. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ పరిధిలోని మగ్గిడి, ఆలూర్, మామిడిపల్లి, మిర్దాపల్లి, పిప్రి, తదితర ప్రభుత్వ పాఠశాలలతో పాటు ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు క్రీడల్లో రాణిస్తున్నారు.

● చదువుతో పాటు క్రీడాలకు ప్రాధాన్యత

విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు ప్రాదాన్యత ఇస్తున్నారు. చదువులే కాకుండా కొంత సమయాన్ని ఆటలకు కేటాయిస్తూ పాఠశాల స్థాయి నుంచే క్రీడలపై ఆసక్తి పెంచుకుంటున్నారు. బాలురతో పాటు సమానంగా బాలికలు వివిధ క్రీడల్లో సత్తా చాటుతున్నారు. రాష్ట్ర, జాతీయస్థాయి పోటీలకు ఎంపికై పతకాలు సాధిస్తూ పాఠశాలకు, తల్లిదండ్రులకు కీర్తి ప్రతిష్ఠలు తీసుకు వస్తున్నారు. రాష్ట్ర, జాతీయస్థాయిలో క్రీడల్లో పాల్గొని స్పోర్ట్స్ కోటలో ఉద్యోగాలు సాధించిన వారెందరో ఉన్నారు. అలాగే, ఆర్మూర్ మండలంలోని మగ్గిడి గ్రామానికి చెందిన విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో విశేషంగా రాణిస్తున్నారు.

● ఆలూర్ విద్యార్థుల రాణింపు

అదేవిధంగా ఆలూర్ ప్రభుత్వ పాఠశాలకు చెందిన శంకర్‌గౌడ్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలలో ప్రతిభను కనబర్చగా.. హ్యాండ్ బాల్‌లో సత్విక్, కీర్తన, అనిత, చిన్నారి, మిత్రేష్‌లు అసమాన ప్రతిభను కనబరిచారు. వీరితో పాటు మామిడిపల్లి ప్రభుత్వ పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు రాష్ట్రస్థాయిలో రాణిస్తున్నారు. అంతేకాకుండా పలువురు విద్యార్థులు క్రీడల్లో రాణించడంతో వ్యాయమ ఉపాధ్యాయులు మధు, రాజేష్‌లతో పాటు ఆయా పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయుడితో పాటు ఉపాధ్యాయుల కృషి ఎంతగానో ఉందంటున్నారు.

● జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విజ్ఞత

మగ్గిడి విద్యార్థిని విజ్ఞత. రాష్ట్రస్థాయి అండర్-14 ఎస్‌జీఎఫ్ వాలీబాల్ పోటటీలో జిల్లా జట్టుకు నాయకత్వం వహించి రాష్ట్రస్థాయి పోటీలలో మొదటి స్థానం సాధించడంలో కీలక పాత్ర పోషించి జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైంది.



బహుమతి అందుకుంటున్న మగ్గిడి విద్యార్థినులు (ఫైల్)

● వాలీబాల్ పోటీలలో దూసుకుపోతున్న శ్రీనిధి

రాష్ట్రస్థాయి అండర్-17 వాలీబాల్ పోటీలలో మగ్గిడికి చెందిన కె.శ్రీనిధి ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైంది. అంతేకాకుండా ఇటీవల ఉత్తరప్రదేశ్‌లోని బరేలీలో జరిగిన జాతీయస్థాయి చాంపియన్ షిప్‌లో రాష్ట్ర జట్టుకు శ్రీనిధి ప్రాతినిథ్యం వహించింది.

● తెలంగాణకు సాయిచరణ్ ప్రాతినిథ్యం

అండర్-14 ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి సాయిచరణ్ జాతీయస్థాయికి ఎంపికయ్యాడు. ఇటీవల ఒడిస్సాలో జరిగిన జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలలో తెలంగాణ జట్టుకు ప్రాతినిథ్యం వహించాడు.

● జాతీయస్థాయి టోర్నీకి హిమతేజ్

రాష్ట్రస్థాయి అండర్-17 వాలీబాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనరిబరిచి హిమతేజ్ జాతీయస్థాయి టోర్నమెంట్‌కు ఎంపికయ్యారు. ఇటీవల బరేలిలో జరిగిన జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలో పాల్గొని రాష్ట్రానికి ప్రాతినిథ్యం వహిచాంచాడు.



సాయిచరణ్,



హిమతేజ్

ధరణి.. కష్టాలు!!



నసురుల్లాబాద్ రెవెన్యూ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ధరణి ఆపరేటర్

ధరణి ఆపరేటర్ల వెట్టి చాకిరీ!

- పది నెలలు గడుస్తున్నా.. అందని జీతాలు
- ఆర్థిక ఇబ్బందుల్లో ధరణి ఆపరేటర్లు

నసురుల్లాబాద్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మండల తహసీల్దార్ కార్యాలయంలో వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్‌ల కోసం ధరణి ఆపరేటర్లు విధులు నిర్వహిస్తున్నారు. కాగా వారు సక్రమంగా విధులు నిర్వహిస్తున్న, జీతాలు మాత్రం సమయానికి అందక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ధరణి ఆపరేటర్లు తహసీల్దార్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తూ వెట్టి చాకిరి చేస్తున్న గత పది నెలల నుంచి జీతాలు రాక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామంటున్నారు. చాలీ చాలని జీతాలు ఇస్తూ ప్రభుత్వం తమతో వెట్టి చాకిరి చేయించుకుంటుందంటున్నారు. అయినా చాలీ చాలని జీతాలతో తమ జీవితం నెట్టుకొస్తున్నామంటున్నారు. అంతేకాకుండా గత ప్రభుత్వం 2018లో రాష్ట్రవ్యాప్తంగా ప్రతీ మండలానికి ఓ ధరణి ఆపరేర్‌ను నియమించింది. కానీ తమ వేతనాలను థర్డ్ పార్టీ ఏజెన్సీ అందిస్తోందంటున్నారు. కాగా రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 671 మంది ధరణి ఆపరేటర్లకు ప్రభుత్వ ఖజానా నుంచి నెలకు 29,500 వేతనం రాగా, కటింగ్‌లు పోను థర్డ్ పార్టీ ఏజెన్సీ ద్వారా తమ ఖాతాలో కేవలం 12 వేల రూపాయలు మాత్రమే జమ అవుతున్నాయని వారు వాపోతున్నారు. ఇటీవల బాన్సువాడ డివిజన్ ధరణి ఆపరేటర్లందరూ కలిసి సబ్ కలెక్టర్ దృష్టికి తమ సమస్యను తీసుకోవడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ధరణి ఆపరేటర్లకు ప్రభుత్వం ఖాజనా ద్వారా వేతనాలు చెల్లించాలని వేడుకుంటున్నారు.

● వేతనాలను సక్రమంగా చెల్లించాలి

: సాయిప్రియ, ధరణి ఆపరేటర్, నసురుల్లాబాద్



రాష్ట్ర వ్యాప్తంగా ధరణి ఆపరేటర్లకు గత పది నెలల నుంచి జీతాలు రావడం లేదు. థర్డ్ పార్టీ ఏజెన్సీ ద్వారా కాకుండా నేరుగా ప్రభుత్వ ఖనాజా నుంచి వేతనాలను సక్రమంగా చెల్లించాలి.

వీసీకి.. అభినందనలు!!

టీయూలో ప్రత్యేక పార్కింగ్ ఏర్పాట్లు

డిచ్‌పల్లి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): గత కొంత కాలంగా తెలంగాణ యూనివర్సిటీ పరిపాలన భవనం వద్ద కళాశాలల అధ్యాపకులు, విద్యార్థులు, బ్యాంకు వచ్చే ఖాతదారులు తమ వాహనాలను ఒకదానివెంట ఒకటి ఇష్టారాజ్యంగా వాహనాలను నిలపడంతో వైస్ చాన్స్‌లర్ యాదగిరిరావు చర్యలకు ఉపక్రమించారు. దీంతో వర్సిటీ సెక్యూరిటీ సిబ్బందితో ద్విచక్రవాహనలు ఒక వైపు, కారులు మరోవైపు ఏర్పాటు చేసేలా చెట్లను చదును చేయించి వాహనాలు ఏర్పాటు చేయిస్తున్నారు. దీంతో తెలంగాణ యూనివర్సిటీ అధికారులు వీసీకి అభినందనలు తెలిపారు.





వర్సిటీ పరిపాలన భవనం వద్ద ఒకవైపు బైకులు, మరోవైపు కార్లు ఇలా..

వంతెన నిర్మాణం కలేనా?

- గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రూ.2.70 కోట్లు మంజూరు ● నిర్మాణంపై నీలినీడలు ● స్థానికులకు తప్పని తిప్పలు ● ఉన్నతాధికారులు దృష్టి సారించేనా?



వర్షాకాలం అమర్లబండ ప్రధాన రోడ్డుపై వాగు ప్రవహించే ప్రాంతం

ఆంధ్రజ్యోతి ఫోకస్



చెరువు అలుగు వద్ద వంతెన నిర్మించాల్సిన స్థలం ఇదే..

సదాశివనగర్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని అమర్లబండ ప్రధాన వాగులో బ్రిడ్జి నిర్మాణం లేకపోవడంతో గ్రామస్థులు ఎన్నో సంవత్సరాలుగా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలోని ధర్మారావుపేట నుంచి తాడ్వాయి మండలం కన్కల్ వరకు కోట్ల రూపాయలతో 8సంవత్సరాల క్రితం రోడ్డు నిర్మించినప్పటికీ.. పలుచోట్ల బ్రిడ్జిలు అవసరమున్న చోట నిర్మించకపోవడంతో గ్రామస్థుల బాధలు వర్ణనాతీతంగా మారాయి. వాగుపై వంతెన నిర్మాణం కోసం గత ప్రభుత్వం రూ.2.70 కోట్లను మంజూరుచేసినప్పటికి ఇంతవరకు పునాది రాయి పడకపోవడంతో అమర్లబండ గ్రామస్థులు ఎన్నో బాధలు ఎదుర్కొంటున్నారు.

వర్షాకాలంలో గ్రామస్థుల ఇబ్బందులు

వర్షాకాలం వచ్చిందంటే చాలు గ్రామప్రజలు వాగు ప్రవహిస్తున్న సమయంలో ప్రమాదమని తెలిసిన తప్పని పరిస్థితుల్లో వాగు దాటిల్సిన పరిస్థితి తలెత్తుతోంది. ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షానికి ఒక్కసారిగా వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో గ్రామానికి ఇతర గ్రామాలతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోతాయి. గ్రామానికి ఒకే ఒక్కరోడ్డు సౌకర్యం ఉండడం వర్షాకాలంలో వాగు ఉధృతంగా ప్రవహిస్తే ఇతర గ్రామాలకు వెళ్లిన వారు అక్కడే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. గ్రామానికి ఆనుకొని చెరువు ఉండడంతో కన్కల్ వైపు వెళ్లాలంటే అలుగు ఉధృతి అక్కడ ధర్మారావుపేట వైపు వెళ్లాలంటే వాగు ఉధృతి ఇక్కడ ఉండడంతో ఆపద సంభవించిన చావడమే తప్ప వేరే దారి లేక భయంతో గ్రామస్థులు వర్షాకాలం అన్నిరోజులు బిక్కుబిక్కుమంటూ బతకాల్సిందే. అత్యవసర సమయంలో ప్రాణాలకు తెగించి ఇతరుల సహాయంతో ట్రాక్టర్‌పైన రోడ్డు దాటించడం తప్ప వేరే గత్యంతరం కనిపించదంటున్నారు.

నిధులు మంజూరైన నిరుపయోగమే..

గత ప్రభుత్వంలో ఏడాదిన్నర క్రితం 2.70 కోట్ల రూపాయలు మంజూరు అయినట్లు ప్రకటించారు. నిధులు మంజూరైనట్లు ప్రకటన రావడంతో గ్రామస్థులు తమ కష్టాలు తొలగనున్నాయని ఆశించారు. కానీ వాళ్ల ఆశలు ఇప్పటికీ నెరవేరకపోవడంతో ఇంకేన్నాళ్ల సమయం పడుతుందని ప్రశ్నలు సందిస్తున్నారు. వంతెన నిర్మాణంపై స్థానిక ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు, ఉన్నతాధికారులతో సమీక్షలు నిర్వహించి గ్రామస్థుల ఇబ్బందులపై దృష్టి సారించి బ్రిడ్జి నిర్మాణంపై కార్యాచరణ వేగవంతంచేస్తేనే గ్రామ ప్రజలకు మేలు జరుగుతుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.



అతివేగం, అధికలోడుతో అనర్థాలు

- ఇష్టారీతిన నడుస్తున్న మొరం టిప్పర్లు
- అయినా.. పట్టించుకోని అధికారులు
- ప్రమాదాలకు కారణమవుతున్న డ్రైవర్లు
- ఇబ్బందుల్లో వాహనదారులు, ప్రయాణికులు

ఆంధ్రజ్యోతి పరిశీలన

తాడ్వాయి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): అక్రమార్జనే ధ్యేయంగా టిప్పర్ల యజమానులు అమాయకుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. మండల కేంద్రంలో మోతాదుకు మించి అధిక లోడ్, అధికవేగంతో టిప్పర్లను తోలుతున్నా.. అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. అనుభవం లేని డ్రైవర్లతో వాహనాలు నడుపుతూ అమాయకుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. అనుభం లేని డ్రైవర్లు వాహనాలను నడపడంతో పలు ప్రమాదాలకు గురవుతున్నారు. సోమవారం బ్రహ్మజీ వాడి శివారులో మొరం టిప్పర్ బోల్తా పడి మొరం మొత్తంరోడ్డు మీద పడి ప్రయాణీకులకు రాకపోకలకు చాలా ఇబ్బందిగా మారింది. టిప్పరు బోల్తా పడిన సమయంలో అటు వైపుగా ప్రయాణికులు ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. హుటాహుటిన యజమానులు వచ్చి జేసీబీ సహాయంతో మొరంను రోడ్డు కిందకి తీసేశారు. బోల్తా పడిన సమయంలో ఎవరైనా రోడ్డుపై ప్రయాణిస్తే పెద్ద ప్రమాదమే సంభవించేది. ఇదంతా అధికారుల కనుసన్నల్లోనే జరుగుతుందని పలువురు గ్రామస్థులు చర్చించుకుంటున్నారు. అయినా అధికారులు మాత్రం చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. అధిక లోడ్‌తో వెళుతూ అమాయకుల ప్రాణాలతో టిప్పర్ యజమానులు ఆడుకుంటున్నారని పలువురు అంటున్నారు. గతంలో కూడా టిప్పరు ప్రమాదంలో చనిపోయిన సందర్భాలు చాలానే ఉన్నాయి. కానీ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లుగా ఉంటున్నారు. టిప్పర్ యజమానులు మాత్రం ప్రభుత్వ ఆదాయానికి గండికోటి అక్రమార్గమే ధ్యేయంగా జేబులు నింపుకొని అమాయకుల ప్రాణాతో చెలగాటం ఆడుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి అనుభవం ఉన్న డ్రైవర్లతో యజమానులు టిప్పర్లను నడిపేటట్లు చూసే విధంగా చేయాలని పలువురు అంటున్నారు.



నివాస గృహాల మధ్యలో నుంచి అధిక లోడ్‌తో వెళుతున్న మొరం టిప్పర్



అతివేగం కారణంగా ప్రమాదానికి గురై ప్రధాన రహదారి మధ్యలోనే అడ్డం పడ్డ మరో టిప్పర్!!



అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్

కలెక్టరేట్‌లో రాజ్యాంగ దినోత్సవ ప్రతిజ్ఞ

నిజామాబాద్ అర్బన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం కలెక్టరేట్‌లో ప్రతిజ్ఞ చేశారు. కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు సమక్షంలో అధికారులు, సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. భారతదేశ ప్రజలమైన మేము దేశ సార్వ భౌమ్య సామ్యవాద లౌకిక ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యముగా నెల కొల్పుటకు, పౌరులందరికి సామాజిక, ఆర్థిక, రాజకీయ, న్యాయమును, భావము, భావప్రకటన, విశ్వాసం, ధర్మం, ఆరాధన-వీటి స్వాతంత్ర్యంను అంతస్తులోనూ, అవకాశంలోనూ, సమానత్వాన్ని చేర్చుటకు అందరిలో నూ వ్యక్తి గౌరవమును, జాతి ఐక్యతను అఖండతను కాపాడేందుకు అంకితభావంతో కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో ప్రశాంత్, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు. ప్రతిజ్ఞకు ముందు అంబేద్కర్ చిత్రపటానికి కలెక్టర్ పూలమాల వేసి నివాళులర్పించారు.

యువత రాజ్యాంగ స్ఫూర్తిని అలవర్చుకోవాలి

: అదనపు కలెక్టర్ అంకిత్

నిజామాబాద్ అర్బన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): యువత రాజ్యాంగ స్ఫూర్తిని అలవర్చుకోవాలని అడిషనల్ కలెక్టర్ అంకిత్ అన్నారు. మంగళవారం నిజామాబాద్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ నిజామాబాద్ ఫీల్డ్ ఆఫీస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రాజ్యాంగ దినోత్సవంలో అదనపు కలెక్టర్ అంకిత్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ న్యాయమూర్తి పద్మావతి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి భారత రాజ్యాంగ ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, ఉపన్యాస పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఆధ్వర్యంలో ఒగ్గు కథ కళాకారులు రాజ్యాంగం గురించి ఒగ్గు కథ రూపంలో వివరించారు. అంతకుముందు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల నుంచి కంఠేశ్వర్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సిబిసిఎఫ్‌పివోబి ధర్మానాయక్, కళాశాల ప్రిన్సిపాల్ నరేష్, రవీంద్రరెడ్డి, ఎన్‌వైకె అధికారి శైలిబెల్లాల్, పాల్గొన్నారు.

పోలీసు శాఖ ఆధ్వర్యంలో..

ఖిల్లా: భారత రాజ్యాంగ ప్రవేశిక కార్యక్రమాన్ని పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఇన్‌చార్జి పోలీసు కమిషనర్ సింధుశర్మ ఆదేశాల మేరకు పోలీసు పరేడ్ మైదానంలో మంగళవారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు డీసీపి(అడ్మిన్)కోటేశ్వర్‌రావ్, అదనపు డీసీపీ(లాఅండ్‌ఆర్డర్)బస్వారెడ్డిలు డాక్టర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అదనపు డీసీపీ (ఏఆర్) శంకర్‌నాయక్, ఏఆర్ ఏసీపి నాగయ్య పాల్గొన్నారు.

రాజ్యాంగం ప్రాముఖ్యతను తెలుసుకోవాలి

: జిల్లా సీనియర్ న్యాయమూర్తి పద్మావతి

డిచ్‌పల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగం ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని జిల్లా సీనియర్ జడ్జి పద్మావతి అన్నారు. మంగళవారం తెలంగాణ వర్సిటీ న్యాయ కళాశాలలో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పద్మావతి మాట్లాడుతూ.. సమకాలీన కాలంలో రాజ్యాంగ సమీక్ష ఆవశ్యకత అనే అంశంపై అవగాహన కలిగి ఉండాలని ఆమె సూచించారు. ఈ సందర్భంగా వ్యాసరచన, పోటీల్లో ప్రతిభ కనబర్చినవారికి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో డా.స్రవంతి, డా.నాగజ్యోతి, విద్యార్థులు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి: తెలంగాణ యూనివర్సిటీ న్యాయ కళాశాలలో మంగళవారం భారత రాజ్యంగ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు లా కళాశాల ప్రిన్సిపాల్ హెచ్‌వోడీ ప్రసన్నరాణి ఆధ్వర్యంలో ఈ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయ కళాశాలల లో వేసిన భారతీ చిహ్నం ఎంతో ఆకట్టుకుంది. విద్యార్థులకు క్విజ్‌పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బోర్డు ఆఫ్ స్టడీస్ స్రవంతి, న్యాయ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ నాగజ్యోతి ప్రొ.ప్రవీన్ కుమార్, నర్సయ్య పాల్గొన్నారు.

డిచ్‌పల్లి: 75ఏళ్లుగా భారత రాజ్యంగం పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రతి ఒక్కరూ రాజ్యంగ స్ఫూర్తిని చాటాలని తహసీల్దార్ ప్రభాకర్ అన్నారు. మంగళవారం భారత రాజ్యంగ దినోత్సవం సందర్భంగా డిచ్‌పల్లి తహసీల్ కార్యాలయం నుంచి బస్టాండ్, రైల్వే స్టేషన్ కళాశాల విద్యార్థులచే వరకు 2కే రన్ ర్యాలీని తహసీల్దార్ ప్రారంభించారు. కార్యక్రమంలో మోపాల్ తహసీల్దార్, ఎంఆర్‌ఐ సంతోశ్, డీటీ శ్రీకాంత్, ఎలక్షన్ డీటీ అశ్వక్, జూనియర్, కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

సిరికొండ: భారత రాజ్యాంగం అమలు దినోత్సవం సందర్భంగా మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో ఎంపీడీవో మనోహర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు అంబేద్కర్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. గడ్కోల్‌లో ఎంపీడీవో మనోహర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సయ్యద్ ముగ్దుంతో కలిస అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. పారిశుధ్య, ఉపాధి హామీ కార్మికులను శాలువతో సన్మానించారు. సిరికొండలో అంబేద్కర్ యువజన సంఘం నాయకులు... అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి రాజ్యాంగం గురించి వివరించారు.

రైతులకు బోనస్ ఇచ్చిన ఏకైక రాష్ట్రం తెలంగాణ

● రాష్ట్ర వ్యవసాయ శాఖ సలహాదారు శ్రీనివాస్ రెడ్డి

కోటగిరి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): దేశంలో రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధరతో పాటు క్వింటాకు 500రూపాయల బోనస్ అందించిన ఏకైక రాష్ట్ర తెలంగాణనేనని రాష్ట్ర వ్యవసాయ శాఖ సలహాదారు పోచారం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. ప్రజాపాలన, ప్రజా వి.యోత్సవ కార్యక్రమంలో భాగంగా పొతంగల్ మండలంలోని టాక్లీ గ్రామంలో మంగళవారం కోటిన్నర వ్యయంతో నిర్మించనున్న టాక్లీ-సాలంపాడ్ రహదారికి ఎమ్మెల్యే పోచారం రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రుణమాఫీతో పాటు రైతులకు బోనస్ ఇవ్వడం చరిత్రాత్మక నిర్ణయం అని కొనియాడారు. ఒక్క బాన్సువాడ నియోజకవర్గంలోనే రైతులకు బోనస్‌తో రూ.50కోట్ల అదనపు ఆదాయం సమకూరిందన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి రూ.15కోట్లు మంజూరు చేసిందన్నారు.

టూరిస్టులను నమ్మి మోసపోవద్దు..

నియోజకవర్గానికి టూరిస్టులుగా వచ్చే వారిని నమ్మి మోసపోవద్దని రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాలరాజు పేర్కొన్నారు. ప్రజల మధ్య చిచ్చులు పెట్టి హైదరాబాద్‌లో తమ పనులు చక్క పెట్టుకునే ప్రయత్నం చేస్తారని అలాంటి వారిని ఆదరించాల్సిన అవసరం లేదని సూచించారు. ఎమ్మెల్యే పోచారం సహకారంతో బాన్సువాడ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు తనవంతు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ హన్మంతు, తహసీల్దార్లు మల్లయ్య, గంగాధర్, ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి, హౌసింగ్ డీఈ నాగేశ్వర్ రావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ధన్‌రాజ్, పాల్గొన్నారు.



టాక్లీ గ్రామంలో మాట్లాడుతున్న పోచారం శ్రీనివాస్ రెడ్డి

స్థలం ఉన్న పేదలకు ఇల్లు మంజూరు చేస్తాం..

కోటగిరి: సొంత స్థలం ఉన్న నిరుపేదలకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. రుద్రూరు మండలంలోని లక్మాపూర్ క్యాంప్ గ్రామం నుంచి అక్బర్‌నగర్ గ్రామం వరకు కోటి రూపాయలతో నిర్మించనున్న మెటల్ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం అక్బర్‌నగర్‌లోని ఫుడ్ అండ్ సైన్స్ కళాశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, తహసీల్దార్ తారాబాయి, ఎంపీడీవో సురేష్ బాబు పాల్గొన్నారు.

పుప్పాలపల్లి గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తా

● రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి

జక్రాన్‌పల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): గత అసెంబ్లీ ఎన్నిక ప్రచారంలో పుప్పాలపల్లి గ్రామాన్ని దత్తత తీసుకుని అభివృద్ధి చేస్తానని, మాట ఇచ్చానని, దాని ప్రకారం గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసి తీరుతానని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. ప్రజాపాలన-ప్రజా విజయోత్సవాల్లో భాగంగా మంగళవారం మండలంలోని బ్రహ్మణ్‌పల్లి, తొర్లికొండ, పుప్పాలపల్లి గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే భూపతిరెడ్డి శంకుస్థాపన చేశారు. అనంతరం పుప్పాలపల్లిలో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పుప్పాలపల్లి గ్రామం కొన్నేళ్ల నుంచి అభివృద్ధిలో వెనుకబడి ఉందని, కాంగ్రెస్ ప్రభుత్వం 11నెలల్లోనే పుప్పాలపల్లి గ్రామానికి రూ.కోటి 35లక్షల నిధులు మంజూరు చేసి అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. జక్రాన్‌పల్లి మండలానికి 500ఇళ్లు మంజూరయ్యాయన్నారు. ఇందులో పుప్పాలపల్లికి 110ఇందిరమ్మ ఇళ్లు అవసరం ఉండగా నాలుగేళ్లలో దశల వారీగా గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లను అర్హులైన పేదలకు నిర్మించి ఇస్తామన్నారు. సుద్దపల్లిలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ మంజూరైందన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ నాయకుల మాటలు నమ్మవద్దని, ఈ రెండు పార్టీలు చేసే దుష్ప్రచారాలను ప్రజలు ఆలోచించాలన్నారు. అనంతరం భారత రాజ్యంగం దినోత్సవం సందర్భండా డాక్టర్ అంబేద్కర్ రాసిన రాజ్యంగ పుస్తకాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. అనంతరం తొర్లికొండలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. నాణ్యమైన భోజనాన్ని వండి విద్యార్థులకు అందించాలని వంట ఏజెన్సీలకు సూచించారు.



పుప్పాలపల్లిలో మాట్లాడుతున్న రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

ఎమ్మెల్యేకు సన్మానం

రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డిని మంగళవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు సన్మానించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామాల వారీగా కేటగిరిలో యువతకే టికెట్‌లు ఇవ్వాలని, పార్టీ కోసం కష్టపడిన వారికి టికెట్ ఇవ్వాలని ఎమ్మెల్యేకు విన్నవించారు.

ప్రయివేట్, కార్పొరేట్ ఆసుపత్రుల ఫీజు దోపిడీని అరికట్టాలి

సిరికొండ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రయివేట్, కార్పొరేట్ ఆసుపత్రుల దోపిడి తారా స్థాయికి చేరుకుందని, ఈ దోపిడీని ప్రభుత్వం వెంటనే అరికట్టాలని ప్రగతి శీల మహిళా సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు పి.రమ, ప్రగతి శీల యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు అనీష్ డిమాండ్ చేశారు. మంగళవారం గడ్కోల్‌లో ప్రైయివేట్ ఆసుపత్రుల, కార్పొరేట్ ఆసుపత్రుల దోపిడీకి వ్యతిరేకంగా చేపట్టిన పోరాట కార్యక్రమాల పోస్టర్లను ఆవిష్కరించారు.

హాకీ క్రీడా పోటీలకు తూంపల్లి విద్యార్థి

సిరికొండ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): హాకీ క్రీడా పోటీలకు తూంపల్లి విద్యార్థి బైకాన్ జస్విత ఎంపికైనట్లు పీడీ నగేష్ తెలిపారు. ఈనెల 10న తెలంగాణ హాకీ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని రైల్వే గ్రౌండ్స్‌లో నిర్వహించిన బాలికల సబ్ జూనియర్ ఎంపిక పోటీలలో ప్రతిభను ప్రదర్శించి జాతీయ క్యాంపునకు జస్విత ఎంపికయ్యారని నగేష్ తెలిపారు. ఈ నెల 27 నుంచి 30 వరకు జరగనున్న పోటీలలో జస్విత పాల్గొంటారని తెలిపారు. జస్వితను ప్రధానోపాధ్యాయుడు, ఎంఈవో రాములు, ఉపాధ్యాయులు అభినందించారు.

గ్రామాభివృద్ధికి చేయూతనందించాలి

డిచ్‌పల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని నడిపల్లి అభివృద్ధికి ప్రతి ఒక్కరూ చేయూత అందించాలని ఈవో కిషన్‌రావు పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలో రాజ్యంగ దినోత్సవం సందర్భంగా నిర్వహిచిన గ్రామ సభలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

అదనపు డీసీపీ కోటేశ్వర్‌రావు బదిలీ

ఖిల్లా, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కమిషనరేట్‌లో ఉన్న అదనపు డీసీపీ (అడ్మిన్) కోటేశ్వర్ రావును ప్రభుత్వం బదిలీ చేసింది. ఆయనను రాచకొండ కమిషరేట్ పరిధిలో అడిషనల్ డీసీపీగా నియామకం చేసింది. ఆయన స్థానంలో జిల్లా కమిషనరేట్‌లో లా అండ్ ఆర్డర్ అదనపు డీసీపీగా పనిచేస్తున్న బస్వారెడ్డిని నియమించింది. ఈమేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులను జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 30 మంది అదనపు ఎస్పీలను బదిలీ చేశారు. జిల్లా పోలీసు కమిషరేట్‌కు లా అండ్ అర్డర్ అదనపు డీసీపీగా మాత్రం ఎవరినీ నియమించలేదు.

సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం

డిచ్‌పల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాలల పరిధిలోని సీబీసీఎస్ బీఏ, బీకాం, బీఎస్సీ బీబీఏ, బీసీఏ, కోర్సులకు 1,3, 5వ సెమిస్టర్ రెగ్యులర్, 2,4,6 వ సెమిస్టర్ బ్యాక్‌లగ్ పరీక్షలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఉదయం జరిగిన పరీక్ష కేంద్రాల్లో 7748 మంది విద్యార్థులకు గాను 7147 మంది పరీక్షలకు హాజరయ్యారని, 601మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని, ఆడిట్ సెల్ డైరెక్టర్ ఘంట చంద్రశేఖర్ తెలిపారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షలకు 6564 మంది విద్యార్థులకు 5989 మంది హాజరయ్యారని, 572 మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడుతున్న ముగ్గురు విద్యార్థులను గుర్తించామని ఆడిట్ సెల్‌డైరెక్టర్ పేర్కొన్నారు.

ఉద్యోగాలను సాధించడం అభినందనీయం

నిజామాబాద్ కల్చరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయంలో ఉన్న పుస్తకాలను సద్వినియోగపర్చుకొని ఉన్నత ఉద్యోగాలను సాధించడం అభినందనీయమని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతరెడ్డి రాజరెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో మోర్తాడ్ మండలం దోన్పాల్ గ్రామానికి చెందిన అనూష రెవెన్యూ విభాగంలో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగాన్ని సాధించినందుకు గాను ఆమెకు శాలువతో అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంతో మంది విద్యార్థులు గ్రంథాలయంలో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించి స్ఫూర్తిదాయకంగా నిలిచారని అన్నారు. బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి నిజామాబాద్, ఆర్మూర్, బాల్కొండ నియోజకవర్గాల గ్రంథాలయాల్లో నెలకొన్న సమస్యలు ఫర్నిచర్ రిపేర్ల కోసం 8లక్షల పొసిడింగ్ ఇవ్వడం జరిగిందన్నారు. గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బుగ్గారెడ్డి మాట్లాడుతూ పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే వారికి అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి బుగ్గారెడ్డి, డిప్యూటీ లైబ్రేరియన్ రాజరెడ్డి, అసిస్టెంట్ లైబ్రేరియన్ తారకం, కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ నరేష్‌రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ రాజేశ్వర్, పాల్గొన్నారు.



ఉద్యోగాన్ని సాధించిన అనూషను అభినందిస్తున్న రాజరెడ్డి



నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న వామపక్ష నాయకులు

కేంద్ర ప్రభుత్వ కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ భారీ ర్యాలీ

సుభాష్‌నగర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ వామపక్ష కార్మిక యూనియన్‌ల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని రాజీవ్‌గాంధీ ఆడిటోరియం నుంచి ధర్నా చౌక్ వరకు ర్యాలీ నిర్వహించి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిఐటియు, ఏఐకెఎంఎస్, ఏఐటియుసి, ఏఐపికెఎంఎస్, ఐఎఫ్‌టియు నాయకులు నూర్జహాన్, రామకృష్ణ, ఓమయ్య, భూమయ్య, వరదయ్యలు మాట్లాడుతూ.. కేంద్రంలో మూడవసారి అధికారంలోకి వచ్చిన బిజెపి సంకీర్ణ ప్రభుత్వం కార్మిక, రైతు వ్యవసాయ కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు వెంకటేశ్, రాజేశ్వర్, సూర్య శివాజీ, ఎం.నరేందర్, గంగారెడ్డి, రమేష్‌బాబు, కంజర భూమన్న, శ్రీకృష్ణ, ఆకుల పాపయ్య, శంకర్‌గౌడ్, నర్సింగ్‌రావు, దేవరాం, ముత్తెన్న, దాసు, గంగాధర్, మల్లేష్, రాజేశ్వర్, కిషన్, రాములు, సుఖన్య, ఫసియుద్దీన్ పాల్గొన్నారు.

ఎస్సీ రిజర్వేషన్ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవ వేడుకలు

సుభాష్‌నగర్, నవంబరు26 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. నగరంలోని పులాంగ్ చౌరస్తాలో గల అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎస్సీ రిజర్వేషన్ వ్యతిరేక పోరాట కమిటీ జిల్లా కన్వీనర్ గైని గంగారాం మాట్లాడుతూ.. రాజ్యాంగానికి మూలం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అన్నారు. డిసెంబర్ 1న జరిగే మాలల సింహ గర్జనను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా మాలమహానాడు అధ్యక్షుడు సక్కి విజయ్‌కుమార్, నీరడి లక్ష్మణ్, ప్రవీణ్, బాలరాజ్, చంద్రశేఖర్, దయాసాగర్, రాజేందర్, భీంరావు గైక్వాడ్ పాల్గొన్నారు.

నగరపాలక సంస్థలో..

సుభాష్‌నగర్: నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మంగళవారం నగరపాలక సంస్థ కార్యాలయ ఆవరణలో అంబేద్కర్ చిత్రపటానికి కమిషనర్ దిలీప్ కుమార్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ముసాయిదా కమిటీ ఆధ్వర్యంలో రచించబడిన రాజ్యాంగం ద్వారా అన్ని వర్గాల హక్కులను రక్షింపబడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ శంకర్, టీపీవో సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో..

సుభాష్‌నగర్: బీఆర్ఎస్ ఆధ్వర్యంలో 75వ భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నగరంలోని ఎల్లమ్మగుట్టలో గల బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు జీవన్ రెడ్డి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అందరికి సమాన హక్కులు భారత రాజ్యాంగం కల్పించిందన్నారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, మాజీ జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్, మాజీ ఎమ్మెల్సీ వీజీగౌడ్, మాజీ జడ్పీటీసీ జగన్ పాల్గొన్నారు.

రైతులకు అండగా సీఎం రేవంత్‌రెడ్డి

మోపాల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతులకు అండగా ఉన్నారని డిసిసిబి బ్యాంక్ వైస్‌చైర్మన్, బోర్గాం(పి) సొసైటీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. మంగళవారం బోర్గాం(పి) సొసైటీ ఆవరణలో సీఎం, వ్యవసాయ శాఖ మంత్రి, రూరల్ ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతులకు బోనస్‌ను ఇవ్వడం జరుగుతుందని అన్నారు. రైతు, ప్రజా సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతున్నారని అన్నారు. రైతు సంక్షేమ ధ్యేయంగా కృషి చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్లు గంగాధర్, మోహన్, నారాయణ, ఈగసాయరెడ్డి, సీహెచ్ మహేందర్‌రెడ్డి, గుత్ప నరేష్, రాజశేఖర్, భుజేందర్, సాయిబాబా, తదితరులు ఉన్నారు.

జాతీయ స్థాయి ఫుట్‌బాల్ టోర్నీకి ఎంపిక

నిజామాబాద్ అర్బన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఇటీవల మెదక్‌లో జరిగిన రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ టోర్నీలో ఉత్తమ ప్రదర్శనను కనబర్చిన నగరానికి చెందిన బ్లూమింగ్ బడ్స్ పాఠశాల విద్యార్థిని ప్రజ్ఞ జాతీయ స్థాయికి ఎంపికైంది. ఈ సందర్భంగా విద్యార్థినిని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి మంగళవారం ఆయన నివాసంలో అభినందించారు. జాతీయ స్థాయికి ఎంపిక కావడం గొప్ప విషయమని విద్యార్థులను ఆటలలో ప్రోత్సహిస్తున్న యాజమాన్యాన్ని ఆయన అభినందించారు. డిసెంబర్ 6 నుంచి 10 వరకు జమ్మూ కాశ్మీర్‌లో జాతీయ పోటీలు జరుగనున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ప్రసన్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉత్తమ ఉద్యోగులకు సన్మానం

సుభాష్‌నగర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ యాజమాన్యం ఉత్తమ ఉద్యోగులను గుర్తించే విధంగా ప్రతీ మూడు నెలలకోసారి ఉత్తమ ఉద్యోగులను సన్మానిస్తుంది. అందులో భాగంగా మంగళవారం త్రైమాసిక ఉత్తమ ఉద్యోగులను ప్రకటించి వారిని ఘనంగా సన్మానించింది. జిల్లా కేంద్రంలోని డిపో-1 కార్యాలయంలో నిజామాబాద్ రీజియన్ పరిధిలోని ఆరు డిపోలలో ఉత్తమ కండక్టర్లకు, ఉత్తమ డ్రైవర్లకు నిజామాబాద్ రీజియన్ మేనేజర్ జానిరెడ్డి ప్రశంసాపత్రాలను అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఆరు డిపోలలో 29 మంది ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డివిఎం శంకర్, డిపో మేనేజర్ సంపూర్ణ ఆనంద్, ఉద్యోగులు పాల్గొన్నారు.

యువకుడిపై పోక్సో కేసు

ఖిల్లా, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఐదో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై గంగాధర్ తెలిపారు. మండలానికి చెందిన ఓ బాలికను ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని వెంటపడి మానసికంగా వేధింపులకు గురి చేసిన ఘటనలో బాలిక కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై గంగాధర్ తెలిపారు.

విజయ డెయిరీ ఎదుట ధర్నా

ధర్పల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోగల విజయ డెయిరీ ఎదుట పాలకేంద్రాల నిర్వాహకులు మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విజయ డెయిరీ నిర్వాహకులకు ప్రభుత్వం బిల్లులు చెల్లించకుండా తీవ్ర ఇబ్బందులు పెడుతున్నట్లు వారు పేర్కొన్నారు. గత మూడు నెలలుగా బిల్లులు చెల్లించడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. బిల్లులు చెల్లించకుంటే సెంటర్లకు పాలు తేవడం కష్టమని రైతులు అంటున్నారని నిర్వాహకులు పేర్కొన్నారు. 15 ఏళ్ల నుంచి ఎప్పుడూ ఈ విధంగా జరగలేదని వారు వాపోయారు. ప్రభుత్వం ఇప్పటికైనా ఐదు నెలల బిల్లులు చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. బిల్లులు సకాలంలో చెల్లించకుంటే జిల్లా వ్యాప్తంగా ధర్నాలు నిర్వహించి కలెక్టరేట్ ముట్టడికి వెనకాడే ప్రసక్తేలేదని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన విజయ డెయిరీ సెంటర్ల నిర్వాహకులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.190	రూ.270	రూ. 295
వెన్‌కాబ్(కిలో)	రూ.200	రూ.280	రూ. 305

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.78600	రూ.72500	రూ.935

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 : అమరన్ (12.00, 3.30, 7.00, 10.30)
స్క్రీన్-2 : మెకానిక్ రాకీ (11.45, 6.15, 9.35)
: కేశవచంద్ర రమావత్ (3.00)
స్క్రీన్-3 : కేశవచంద్ర రమావత్ (10.40)
: కనక మహాలక్ష్మి (1.30)
: క (4.00)
: జీబ్రా (7.15, 10.40)
స్క్రీన్-4 : లక్కీ భాస్కర్ (1.00, 7.05)
: దేవకినందన వసుదేవ (4.15, 10.20)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 :
మెకానిక్ రాకీ (10.30, 10.20)
: అమరన్ (1.30)
: లక్కీ భాస్కర్ (4.30)
: దేవకినందన వసుదేవ (7.40)
స్క్రీన్-3
: అమరన్ (10.20, 7.30, 10.30)
: జీబ్రా (1.30)
: మెకానిక్ రాకీ (4.30)

దేవి : మెకానిక్ రాకీ (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : అమరన్ (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : కంగువా (11.15, 2.15,6.15, 9.15)
లలితామహల్: దేవకినందన వసుదేవ (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్